
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

5

గురువారం 4 జనవరి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	220	240
సూర్యాపేట	రూ.130	192	221
నల్లగొండ	రూ.132	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 16.0



వేములపల్లి మండలంలో వరినాట్లు ఎర్రబారి కుళ్లిపోవడంతో బీళ్లుగా మారిన పొలం

ఆయగడ్డు కాలం

- వరి సాగుకు అనుకూలించని వాతావరణం
- కుళ్లిపోతున్న వరి నాట్లు
- పిలకలు వేయకుండానే ఈత పట్టిన మొలకలు
- పెట్టుబడి కూడా కష్టమేనంటున్న రైతులు

నాగార్జునసాగర్ ఆయకట్టులో వానాకాలం సాగు విస్తీర్ణం 40 శాతానికి పడిపోయింది. వర్షాలు కురవకపోవడం, ప్రాజెక్టుల్లో నీరు నిల్వలేకపోవడంతో యాసంగి బోరు బావుల సేద్యం 30 శాతానికి పడిపోయింది. కష్టనష్టాల కోర్చి సాగు చేస్తున్న రైతులకు వాతావరణం శాపంగా మారింది. కొన్నిచోట్ల నాటిన నెలలోపే వరి మొక్కలు ఈతకు వస్తుండగా మరికొన్ని ప్రాంతాల్లో వేసిన నాట్లు ఎర్రగామారి కుళ్లి మట్టిలో కలుస్తున్నాయి. వాతావరణ ప్రతికూల పరిస్థితులతో ఎకరానికి రూ.16 వేలకుపైగా పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- మిర్యాలగూడ

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాల్లో యాసంగిలో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటివరకు నల్లగొండ జిల్లాలో లక్షా 40 వేల ఎకరాల్లో నాట్లు పూర్తి కాగా మరో లక్షన్నర ఎకరాలకు వరి నారు సిద్ధంగా ఉంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటి లభ్యత లేకపోవడంతో వానాకాలం సీజన్‌లో కూడా ఎడమకాల్వకు నీటివిడుదల కాలేదు. అయినప్పటికీ కమాండ్ ఏరియా కింది రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగువైపు దృష్టి సారించక వరి పంట వైపే మొగ్గు చూపారు. మెట్ట పంట కంటే వరి సాగు కొంత సులభతరం కావడం, సన్నధాన్యానికి ధర ఉండటంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధరకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించడంతో అన్నదాత లు వరిసాగుకే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

పిలకలు రాకుండానే ఈతకు

వరి పైరు ఎదగకుండానే నాటిన నెలలోపే ఈతకు రావడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. గత నవంబరు నెలలో నార్లు పోసి 28 నుంచి 35 రోజుల్లో రైతులు వరినాట్లు పూర్తి చేసిన రైతులు నెలదాటుతున్నా వరిలో ఎదుగుదల లేకపోవడంతో దిగాలు చెందుతున్నారు. డిసెంబరు మొదటి వారంలో వరి నాట్లు పూర్తి చేశారు. అప్పటి నుంచి వరి పైర్లు పిలకలు వేసి దుబ్బు కట్టకుండానే ఈత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోర్ల బావుల కింద వరిసాగు చేస్తున్నందున వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగితే పంటలకు నీటిలభ్యత కరువు అవుతుందన్న భావన రైతు ల్లో నెలకొంది. ఈ క్రమంలో పంట కాలవ్యవధి తక్కువగా ఉన్నా సన్న రకం వరిని ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. 110 రోజుల్లో కోతకు వచ్చే చింట్ల రకం విత్తనాలను ఎక్కువ మంది రైతులు సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది. త్రిపురారం మండలంలో నీలాయిగూడెం మరి కొన్ని గ్రామాల్లో వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా వేసిన నాట్లు వేసినట్లే ఉండి పొట్టదశకు చేరుకుని, ఈతలు వేస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

రైతును దెబ్బతీసిన వర్షాలు

నాట్లు వేసే సమయంలో కురిసిన జల్లులు వరి రైతులను కుంగదీశాయి. డిసెంబరు మొదటివారంలో వరినాట్లు పూర్తి చేసుకున్న రైతులు రెండురోజుల పాటు కురిసిన జల్లులతో నాట్లు నేలకు పడిపోయాయని ఆరోపిస్తున్నారు. సహజంగా వరి ఎదుగుదలకు వర్షం అనుకూలమైనప్పటికీ యాసంగి ప్రారంభంలో కురిసిన వర్షపు జల్లులు నష్టాన్ని కలిగించాయని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు విపరీతంగా కురుస్తున్న మంచుతో పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని రైతులు చెబుతున్నారు. ప్రతికూల వాతావరణంలో వేములపల్లి, మాడ్గులపల్లి మండలాల్లో వందల కొద్ది ఎకరాల్లో వరి నాట్లు 60 శాతానికి పైగా దెబ్బతిన్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఉదయం 11 గంటల వరకు మంచు కురుస్తుండటంతో వరి మొక్కలు ఏపుగా ఎదగకపోగా నాటిన మొక్కలు ఎర్రబారి కుళ్లిపోయి మట్టిలో కలిసిపోతున్నాయని, దుబ్బు కట్టేందుకు 4జీ గుళికలు, యూరియా వాడకం పెంచినా ఫలితం లేకుండా పోతోందని ఆరోపిస్తున్నారు. సస్యరక్షణ చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోతోందని వాపోతున్నారు. విత్తనాలు, దుక్కులు, నాటి కూలీ, ఎరువులు జల్లించి పురుగు మందులు కూడా పిచికారీ చేశామని, ఎకరానికి రూ.14 నుంచి రూ.16 వేలకు పైగా పెట్టుబడి పెట్టగా వాతావరణ ప్రతికూల పరిస్థితుల్లో దిగుబడి పూర్తిగా తగ్గి పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవచ్చని రైతులు బెంగపడుతున్నారు.

విత్తన కంపెనీలపై కొరవడిన పర్యవేక్షణ

వరి సాగుపై ఉన్న రైతుల ఆసక్తిని సొమ్ముచేసుకునేందుకు పలురకాల బ్రాండ్ల పేరుతో ఏటా కొత్త కంపెనీల విత్తనాలు మార్కెట్‌ల్లోకి వస్తున్నాయి. ఆయా కంపెనీలు పలు రకాల ఆకర్షణీయమైన ప్రకటనలతో రైతులను ఆకర్షిస్తున్నాయి. ఆయా కంపెనీలు ప్రాసెస్ చేసిన విత్తనాల్లో నాణ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే, పంట దిగుబడిని పరిగణించకుండానే మార్కెట్లోకి విడుదల చేస్తుండటంతో నాణ్యతా లోపంతో వాతావరణ ప్రతికూల పరిస్థితులను తట్టుకోలేక దిగుబడి పూర్తిగా తగ్గి రైతులు నష్టపోవాల్సి వస్తుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

60 రోజులకే ఈత పట్టింది



110 రోజులకే పంటకు వస్తుందని చెబితే మహేంద్ర చింట్ల వరి రకాన్ని 5 ఎకరాల్లో సాగు చేశా. నెలరోజుల నారును డిసెంబరు మొదటి వారంలో నాటు వేయగా నాట్లు దుబ్బు కట్టకుండానే ఈత వేస్తున్నాయి. ఎకరానికి 40 బస్తాల ధాన్యం దిగుబడి రావాల్సి ఉండగా 15 బస్తాల ధాన్యం వచ్చే పరిస్థితి లేదు. పక్క రైతు 8 ఎకరాల్లో కూడా పైరు ఈ రకంగానే ఈత పట్టింది.

- సాయి, యువరైతు, నీలాయిగూడెం, త్రిపురారం మండలం

ఉష్ణోగ్రతలు పడిపోవడమే కారణం



డిసెంబరు నుంచి జనవరి వరకు మంచు కారణంగా రాత్రివేళలో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల స్థాయికి పడిపోతున్నాయి. దీంతో వరి మొక్కల్లో ఎదుగుదల లోపిస్తోంది. వరి నారుదశలో ఉంటే ఎరుపు ఎక్కుతుంది. నాట్లు వేస్తే మొక్కలు ఎదగక పూర్తిగా ఎర్రబారుతుంది. చలికి లేత వరి నారు జింకు ధాతువులను తీసుకోలేదు. నారుకు మంచు నేరుగా పడకుండా పరదాలు కప్పుకోవాలి. వేడి రావడానికి సూపర్ ఫాస్ఫేట్ వేసుకోవాలి. నాటువేసుకుంటే చిలామిన్ జింకు పిచికారీ చేసుకోవాలి.

- పాల్వాయి శ్రవణ్ కుమార్, జేడీఏ, నల్లగొండ

చి'వరి'కి నీరందక...



హుజూర్‌నగర్‌లో బోర్లు వేస్తున్న రైతులు

హుజూర్‌నగర్ : నాగార్జునసాగర్ ఆయకట్టు చివరి భూములకు కాలం కలిసిరావడం లేదు. వానాకాలం రైతులు వేసిన పంటలు కాపాడుకోలేకపోయారు. యాసంగి సీజన్‌కు నీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. సూర్యాపేట జిల్లాలోని సాగర్ ఎడమకాల్వ పరిధిలోని మొదటి జోన్ కింద లక్షా 37వేల ఎకరాల ఆయకట్టు ఉండగా ఖరీఫ్‌లో 50 వేల ఎకరాల్లో సాగుచేశారు. సుమారు 87 వేల ఎకరాల ఆయకట్టు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం రైతులు యాసంగి పంటపై కుస్తీ పడుతున్నారు. బోరుబావుల కింద సేద్యం చేస్తున్నారు. నీటి లభ్యత తక్కువగా ఉండటంతో పదెకరాలు ఉంటే నాలుగు ఎకరాలు సాగు చేస్తున్నారు. జిల్లా మొత్తంలో సాగర్ ఆయకట్టులో 30శాతం అనగా సుమారు లక్ష ఎకరాలు మాత్రమే సాగుచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని మట్టపల్లి, రామాపురం, ముక్త్యాల, రెడ్లకుంట, లింగగిరి, చింతలపాలెం మేజర్ల పరిధిలో రైతులు కొత్తగా బోర్లు వేస్తున్నారు. ఒక్కో బోరుకు సుమారు రూ.50వేలు ఖర్చు వస్తోంది. 200 అడుగుల్లోతు బోర్లు వేస్తున్నా అనేకచోట్ల నీరు పడక ఇబ్బందులు పడుతున్నారు.

బోర్లు వేసినా ఫలితం లేదు




బోర్లు వేసినా భూగర్భజలాలు అందడంలేదు. దీంతో తీవ్రఇబ్బందులు పడుతున్నాం. నీటి వసతుల కోసం చాలాబోర్లు వేశాం. రైతులు బావులు తవ్వించినా నీరు లభ్యంకాక పలుచోట్ల బోర్లు వేస్తున్నాం.

- కంచర్ల మధుసూదన్‌రెడ్డి, రైతు, హుజూర్‌నగర్

చెర్వుగట్టుకు ట్రస్టు 'బోర్డు' ఏర్పాటయ్యేనా!

- పాలకమండలి లేక ఏడాది పూర్తి
- ఉత్సవాల నాటికైనా కొత్త కమిటీని ప్రకటిస్తారా?
- లేక ఉత్సవ కమిటీతో సరిపెడతారా?



చెర్వుగట్టు ప్రధానాలయం, (ఇన్‌సెట్‌లో) రామలింగేశ్వర స్వామి మూలవిరాట్టు

నార్కట్‌పల్లి, జనవరి 3: జిల్లాలో ప్రసిద్ధ శైవక్షేత్రంగా భాసిల్లుతున్న నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుపై సందిగ్ధత నెలకొంది. మేకల అరుణారాజిరెడ్డి ఛైర్మన్‌గా 3 జనవరి 2021లో ఏర్పాటైన పాలకమండలి రెండేళ్ల పాటు కొనసాగింది. అయితే మొదటి సంవత్సరం ట్రస్టు బోర్డుగానే వ్యవహరించిన కమిటీ రెండో సంవత్సరం మాత్రం అదే సభ్యులతో కేవలం అభివృద్ధి కమిటీగా కొనసాగింది. అభివృద్ధి కమిటీ పదవీకాలం కూడా 2023 జనవరి 2 నాటికి ముగిసింది. ఐతే ధర్మకర్తల మండలి పదవీకాలం ముగిసే నాటికి కొత్త ట్రస్టు బోర్డును ఏర్పాటుచేయాలని అప్పట్లో ప్రయత్నించినా పదవులను ఆశించిన నాయకుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో కొత్త బోర్డును వేయలేదు. పైగా ఎన్నికల ఏడాది కూడా కావడంతో పదవుల పంపకం కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతుందని సందేహంతో ఆసక్తి చూపలేదు. దీంతో ఏడాదిగా దేవస్థానానికి పాలకవర్గం ఏర్పడలేదు. ఐతే రాష్ట్రంలో తాజాగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతల్లో ఆశలు మొదలయ్యాయి. దీనికి తోడు ప్రజాపాలన ముగిసిన వెంటనే నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టిపెడతామని సీఎం రేవంత్‌రెడ్డి తాజాగా ప్రకటించిన నేపథ్యంలో చర్చ మొదలైంది. ఫిబ్రవరి 16 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో అప్పటిలోగా దేవస్థానానికి కొత్త కమిటీని వేస్తారా? స్థానిక ఎన్నికల దృష్ట్యా ఉత్సవ కమిటీని వేస్తారా? అన్న ప్రశ్న ఆశావహుల్లో నెలకొంది.

ఎలా న్యాయం చేస్తారోనన్న ఆసక్తి

కోమటిరెడ్డి సోదరుల సహకారంతో కాంగ్రెస్‌లో చేరిన వేముల వీరేశం ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారు. దీంతో నియోజకవర్గంలో మాటెలా ఉన్నా కోమటిరెడ్డి సోదరుల సొంత మండలమైన నార్కట్‌పల్లి మండల పరిధిలో ఇచ్చే నామినేటెడ్ పదవుల పంపకంలో మాత్రం ఎమ్మెల్యే ఆచితూచి వ్యవహరిస్తారన్న అభిప్రాయం పార్టీ నేతల్లో వినపడుతోంది. కొత్త, పాత నేతలను కలుపుకుని పనిచేస్తానని ఎన్నికల ప్రచార సభల్లోనే బహిరంగంగా ప్రకటించారు. ఫలితంగా నామినేటెడ్ పదవులను పంచాల్సిన నేపథ్యంలో ఆయన వెన్నంటి నడిచిన కార్యకర్తలు కొంత త్యాగానికి సిద్ధపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఐతే కాంగ్రెస్‌లో చేరకముందు తనతో పాటే ఐదేళ్లుగా నడిచిన కేడర్‌లో కొందరికి నామినేటెడ్ పదవి ఇస్తానని వీరేశం మాట ఇచ్చారు. పైగా అనూహ్యంగా కాంగ్రెస్‌లో చేరడం పార్టీ కూడా అధికారంలోకి రావడంతో వెన్నంటి నడిచిన నేతల్లో పదవులపై ఆశలు రేకెత్తాయి. దీంతో పాత, కొత్త కేడర్ కలబోతగా చెర్వుగట్టు దేవస్థాన పాలకవర్గం ఏర్పాటులో ఎమ్మెల్యే ఎవరికి ఎలా న్యాయం చేస్తారోనన్న ఆసక్తి అందరిలో నెలకొంది.

ఎన్నికల ముందు 'ట్రస్టుబోర్డు' వేసేనా?

వచ్చే ఆర్నెళ్లలో వరుసగా పార్లమెంట్, ఆ తర్వాత పంచాయతీ, మండల పరిషత్‌లకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర స్థాయి మినహా స్థానికంగా ఉండే నామినేటెడ్ ప దవుల భర్తీ ఇప్పట్లో ఉండకపోవచ్చనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినపడుతోంది. ఇందులో భాగంగానే చెర్వుగట్టు దేవస్థానం ట్రస్టుబోర్డు ఏర్పాటు కూడా ఎన్నికల తర్వాతే ఉంటుందనే ప్రచారమూ ఉంది. ఒకవేళ ఎన్నికల ముందు ట్రస్టుబోర్డు వేస్తే పదవులు ఆశించి భంగపడే అసంతృప్తులతో స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపొచ్చనే సందేహంతో వేయకపోవచ్చనే వాదన వి నిపిస్తోంది. ఒకవేళ ట్రస్టు బోర్డు వేయడం కుదరకపోతే ఉత్సవ కమిటీని వేస్తారన్న ప్రచారమూ ఉంది.

తేలని సాగర్ పంచాయితీ

7

- 35 రోజులుగా మూతపడిన కంట్రోల్ రూం
- లిఫ్ట్ రూం నుంచే నీటి వివరాలు నమోదు చేస్తున్న తెలంగాణ ఇంజనీర్లు

నల్లగొండ కలెక్టర్‌గా హరిచందన



నల్లగొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా నూతన కలెక్టర్‌గా దాసరి హరిచందనను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇక్కడ పనిచేసిన కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌ను ఆరోగ్యశాఖ డైరెక్టర్‌గా బదిలీ చేసిన విషయం తెలిసిందే. కర్ణన్ బదిలీ అయిన తర్వాత హేమంత్ కేశవ్‌పాటిల్‌కు ఇన్‌చార్జి కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు. 2010 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దాసరి హరిచందన జీహెచ్‌ఎంసీలో వెస్ట్ జోనల్ సీఎస్‌ఆర్(కార్పొరేట్ సామాజిక బాధ్యత) అదనపు కమిషనర్‌గా, ఆయూష్ డైరెక్టర్‌గా, నారాయణపేట జిల్లా కలెక్టర్‌గా కూడా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో కూడా కొంతకాలంపాటు ఉన్నతాధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం మునిసిపల్‌శాఖ డీఎంగా, ప్రజావాణి స్పెషల్ ఆఫీసర్‌గా కొనసాగుతున్న హరిచందనను రాష్ట్ర ప్రభుత్వం నల్లగొండ కలెక్టర్‌గా నియమించింది. ఇటీవల జిల్లా ఎస్పీగా చందనా దీప్తి బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. జిల్లాలో ఇద్దరు ఉన్నతాధికారులు మహిళలు కావడం విశేషం. దాసరి హరిచందన బ్రిటీష్ కౌన్సిల్ అవార్డును 2021 సంవత్సరంలో అందుకున్నారు. భారతదేశంలో ప్రజాసేవ చేసిన యంగ్ డైనమిక్ ఆఫీసర్లలో ఆమె పేరును బ్రిటీష్ ప్రభుత్వం ఎంపిక చేసింది. దేశంలో ఈ అవార్డుకు ఎంపికైన ఏకైక ఆఫీసర్ ఈమె ఒక్కరే.

ప్రణాళికతో పనిచేయాలి: హేమంత్ కేశవ్ పాటిల్

నల్లగొండ, జనవరి 3: రాబోయే పార్లమెంట్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రణాళికతో పని చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. గురువారం ఆయన ఛాంబర్‌లో నిర్వహించిన వివిధ ప్రభుత్వ శాఖ అధికారులతో కలిసి ఇంటలిజెన్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సందర్భంగా ఎక్కువగా నగదు, నగలు పట్టుబడిన మునుగోడు, ఆంధ్రప్రదేశ్‌తో సరిహద్దు ఉన్న మిర్యాలగూడలను ప్రత్యేక ప్రాంతాలుగా గుర్తించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత చెక్ పోస్టులు ఏర్పాటు చేసి గట్టి నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డీవోలు పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్, రవాణా, వాణిజ్యపన్నుల శాఖ, ఇన్‌కమ్‌టాక్స్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయికి నివాళి

8



జిల్లాకేంద్రంలో సావిత్రీబాయికి నివాళి అర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

నర్సింగ్ కళాశాల కోసం నిరీక్షణ

- గతంలో కొనసాగిన కళాశాల
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో కొత్త ఆశలు



నిరుపయోగంగా ఉన్న పాత ఆస్పత్రి భవనం

నాగార్జునసాగర్, జనవరి3: ప్రభుత్వ నిర్ణయంతో నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని మహిళలు, యువతలో ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న నర్సింగ్ కళాశాల ఏర్పాటు డిమాండ్‌కు పరిష్కారం లభించే అవకాశం ఉండడంతో వారి నిరీక్షణకు తెరపడనుంది. నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఆరు దశాబ్దాల క్రితం నాటి ప్రధాని నెహ్రూ సతీమణి పేరున కమలా నెహ్రూ పేరుమీద ఏరియా ఆస్పత్రిని నిర్మించారు. ఈ ఆస్పత్రికి నల్లగొండ, గుంటూరు, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, ప్రకాశం తదితర జిల్లాల నుంచి రోగులు వచ్చి వైద్యం చేయించుకునే వారు. ఈ ఆస్పత్రిలో 1992లో వితంతువులకు, అనాథ మహిళలకోసం శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్టాఫ్ నర్సు కోర్సు కోసం నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఈ కళాశాలలో సంవత్సరానికి 30సీట్ల చొప్పున మహిళలకు నర్సింగ్ విద్యనందించేవారు. ఆ కళాశాలను మూడేళ్లు కొనసాగించి, తర్వాత తీసివేశారు. దీంతో అప్పటినుంచి ఈ ప్రాంత మహిళలు, బాలికలు నర్సింగ్ విద్యను చదవాలంటే హైదరాబాద్, నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, వరంగల్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఇక్కడి యువతులు నర్సింగ్ విద్యను అభ్యసించాలంటే దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇంటర్‌తోనే చదువును మానేస్తున్నారు.

అయితే పాత ఆస్పత్రి భవనం పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో రూ.18కోట్లతో నూతన ఆస్పత్రి భవనాన్ని 2019లో నిర్మించారు. దీంతో పాత ఆస్పత్రి భవనం నుంచి వైద్యసేవలను కొత్త ఆస్పత్రి భవనంలోకి మార్చడంతో పాత ఆస్పత్రి భవనం నిరుయోగంగా ఉంది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న పాత ఆస్పత్రి భవనంలో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇదిలా ఉంటే గతంలో ఇక్కడ నర్సింగ్ కళాశాలలో పనిచేసిన నలుగురు నర్సింగ్ ట్యూటర్‌లు ప్రస్తుతం సాగర్ ఆస్పత్రి నుంచే వేతనాలు తీసుకుంటూన్నారు. సాగర్ నుంచి వేతనం పొందుతూ హైదరాబాద్‌లో ఉస్మానియా, గాంధీ, నీలోఫర్ ఆస్పత్రుల కళాశాలల్లో డిప్యుటేషన్‌పై ట్యూటర్లుగా పనిచేస్తున్నారు.

రాష్ట్రంలో 64 నర్సింగ్ కళాశాలల ఏర్పాటుకు సీఎం ఆదేశాలు

రాష్ట్రంలో నర్సుల కొరత ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో కొత్తగా మరో 64 నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత శాఖకు ఆదేశాలు జారీచేశారు. 100 పడకల ఆస్పత్రి ఉన్న ప్రతీ చోట నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుంది. దీంతో సాగర్ హిల్‌కాలనీలో కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రి పాత భవనంలో గతంలో మాదిరిగా నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తారని స్థానిక యువతులు, మహిళలతోపాటు సాగర్ చుట్టుపక్కల ఉన్న సుమారు 35తండాలకు చెందిన కృష్ణ పట్టె పరిధిలో గిరిజన యువతులు, విద్యార్థినుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

రాష్ట్రంలో ప్రస్తుతం 22 ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు

ప్రస్తుతం రాష్ట్రంలో 22 ప్రభుత్వ, 78 వరకు ప్రైవేటు నర్సింగ్ కళాశాలలుండగా మొత్తం 3,150 నర్సింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో నర్సుల కొరత ఉండటంతో కోవిడ్ సమయంలో డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఆరోగ్య శాఖ నియమాల ప్రకారం ప్రతీ వంద పడకల ఆస్పత్రిలో 45 మంది నర్సులుండాలి. కానీ ప్రస్తుతం 25 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు.

ప్రభుత్వం అనుమతిస్తే సిద్ధంగా ఉన్నాం



సాగర్ ఆస్పత్రిలో నర్సింగ్ కళాశాలను నిర్వహించడానికి ప్రభుత్వం అనుమతిస్తే నడపటానికి సిద్ధంగా ఉన్నాం. ఇక్కడ నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయడానికి ట్యూటర్లు కూడా ఉన్నారు. వారు డిప్యుటేషన్‌పై హైదరాబాద్‌లో ఉన్నారు. వారిని ఇక్కడకు రప్పిస్తాం. భవనం కూడా అందుబాటులో ఉంది.

- డాక్టర్ భానుప్రసాద్ నాయక్, సీఎంవో

సెంటిమెంట్‌తో రాజకీయం చేస్తున్న బీజేపీ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ రూరల్, జనవరి 3: సెంటిమెంట్‌తో బీజేపీ రాజకీయం చేసి లబ్ధి పొందాలని చూస్తోందని, పార్లమెంటు ఎన్నికల వేళ అయోధ్యలో రామ మందిరాన్ని తెరపైకి తెచ్చారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవనంలో బుధవారం సీపీఎం జిల్లా విస్తృతసాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి మూడోసారి అధికారంలోకి రావాలని బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. అందులో భాగంగానే అయోధ్యలోని రామ మందిరాన్ని ముందుకు తెచ్చి దేశవ్యాప్తంగా క్యాంపెయిన్ చేస్తూ ప్రజలను సెంటిమెంటుతో మోసం చేయాలని చూస్తోందన్నారు. ఒకే దేశం, ఒకే మతం, ఒకే భాష, ఒకే ఆహారంలాంటి విధానాలను ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారని గుర్తుచేశారు. ఇండియా కూటమిలో ఉన్న అన్ని పార్టీలు సమన్వయంతో ముందుకెళ్తున్నాయని, బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ఇండియా కూటమి పనిచేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సాగర్ అయకట్టుకు, ఏఎమ్మార్పీ కాల్వలకు నీటిని విడుదల చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నారి ఐలయ్య, కందాల ప్రమీల, పాలడుగు నాగార్జున, ప్రభావతి, మహమ్మద్ హాశం, సిహెచ్ లక్ష్మీనారాయణ, కూన్‌రెడ్డి నాగిరెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్టా నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఏ కార్యాలయం ఎప్పుడో?

● దేవరకొండలో ఆర్టీఏ కార్యాలయం లేక వాహనదారుల ఇబ్బందులు ● నూతనంగా ప్రకటించనున్న జాబితాలో దేవరకొండ ఉండేనా?



దేవరకొండ, జనవరి 3: నల్లగొండ జిల్లా దేవరకొండలో ఆర్టీఏ కార్యాలయం లేకపోవడంతో వాహనదారులు, వాహనాల యాజమానులు, డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. దేవరకొండ డివిజన్ కేంద్రం ఏర్పాటు అయిన ప్పటికీ రోడ్డు రవాణాశాఖ ఆర్టీఏ కార్యాలయం లేకపోవడంతో డ్రైవింగ్ లైసెన్స్‌లకు, నూతన వాహనాదారుల నెంబర్లకు, లైసెన్స్ రెన్యువల్‌కు మిర్యాలగూడ, నల్లగొండ పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆర్టీఏ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తారని వాహనాల యాజమానులు, డ్రైవర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న వాహనాల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన సత్వర సేవలు అందించడానికి నూతన రవాణాశాఖ కార్యాలయాల ఏర్పాటుకు ఆ శాఖ ప్రతిప్రాదనలు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్లు, లైసెన్స్‌ల మంజూరు, యజమానుల హక్కుల మార్పిడి తదితర సేవలను ఆర్టీఏ అందిస్తుంది. నూతనంగా కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు కావడంతో తెలంగాణ వ్యాప్తంగా 20 నుంచి 30 వరకు నూతనంగా ఆర్టీఏ కార్యాలయాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తుంది. దేవరకొండకు నూతన ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటైతే కొన్నేళ్లు నెలకొన్న సమస్యలు పరిష్కారం అవుతాయని వాహనదారులు, డ్రైవర్లు అభిప్రాయ పడుతున్నారు. రవాణా శాఖ ప్రాంతీయ కార్యాలయం దేవరకొండలో లేకపోవడంతో 60 కిలోమీటర్ల దూరం ఉన్న నల్లగొండ, 80 కిలోమీటర్ల దూరం ఉన్న మిర్యాలగూడేనికి వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. పని మానుకొని రోజంతా అక్కడే ఉండాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. దేవరకొండ డివిజన్‌లో వేలాదిగా వాహనాలు ఉన్నాయి. లారీ అసోసియేషన్ కార్యాలయం కూడా ఉంది. దీనితో పాటు దేవరకొండ, కొండమల్లేపల్లిలో ట్రాక్టర్, ద్విచక్ర వాహనాల షోరూం లు ఉన్నాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దేవరకొండలో ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కారించాలని వాహన యాజమానులు, లారీ డ్రైవర్లు కోరుతున్నారు.

లైసెన్స్ కోసం మిర్యాలగూడెం, నల్లగొండకు వెళ్లాల్సి వస్తుంది

డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు రెనువల్ చేసుకోవాలంటే మిర్యాలగూడెం, నల్లగొండకు వెళ్లవలసి వస్తుంది. దీంతో రోజంతా సమయం వృథా అవుతుంది. దేవరకొండలో ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది. అధికారులు పట్టించుకోవడం లేదు.

లైసెన్స్ కోసం మిర్యాలగూడెం, నల్లగొండకు వెళ్లాల్సి వస్తుంది

డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు రెనువల్ చేసుకోవాలంటే మిర్యాలగూడెం, నల్లగొండకు వెళ్లవలసి వస్తుంది. దీం తో రోజంతా సమయం వృథా అవుతుంది. దేవరకొండ లో ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటు చేస్తే సమస్య పరి ష్కారం అవుతుంది. అధికారులు పట్టించుకోవడం లేదు.

– సమడం తిరుమల్‌రావు, లారీ డ్రైవర్, దేవరకొండ

ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటు చేయాలి



దేవరకొండలో రోడ్డురవాణాశాఖ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలి. రవాణాశాఖ కార్యాలయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాము. ప్రభుత్వం స్పందించి వెంటనే ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటు చేయాలి.

– గాజుల రాజేష్, వాహన యాజమాని దేవరకొండ

రవాణా కార్యాలయం ఏర్పాటుకు కృషి



దేవరకొండలో త్వరలో రవాణా కార్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తా ఈ విషయాన్ని సీఎంతో పాటు రవాణాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తా, రవాణాశాఖ కార్యాలయం ఏర్పాటు అయ్యేలా చర్యలు చెపడుతా.

– నేనావత్ బాలునాయక్, దేవరకొండ ఎమ్మెల్యే.

7న ఉమ్మడి జిల్లా స్థాయి
సాఫ్ట్‌బాల్ పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, జనవరి 3: ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి సాఫ్ట్ అండర్- 19 ఏళ్ల బాల్ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అండర్- 19 ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీన ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి జిల్లాలకు చెందిన క్రీడాకారులు టెన్త్ మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు పీడీ కె.నర్సిరెడ్డి నెంబర్ 9440072854 సంప్రదించాలని కోరారు.

బైక్ తీసుకెళ్లిన ఫైనాన్స్ వ్యాపారులు
మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



లావూరి మంజ(ఫైల్)

తుర్కపల్లి, జనవరి 3: వాయిదాలు చెల్లించలేదని ఫైనాన్స్ వ్యాపారులు తన బైక్‌ను బలవంతంగా తీసుకెళ్లారని మనస్తాపం చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మోతీరాంతండా గ్రామపంచాయతీ పరిధిలోని గోగులగుట్టతండాలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లావూరి మంజ(50) తనకున్న అర ఎకరం పొలంలో వ్యవసాయం చేసుకుంటూ, కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అప్పు చేసి తన వ్యవసాయ బావి వద్ద రెండు మూడు బోర్లు వేశాడు. రెండు సంవత్సరాల క్రితం భువనగిరిలోని ఓ ఫైనాన్స్ సంస్థలో రూ.20వేలు అప్పు తీసుకొని ద్విచక్ర వాహనం(టీవీఎస్ ఎక్సల్) కొనుగోలు చేశాడు.

బైక్‌పై గ్రామాల్లో తిరుగుతూ ఉల్లిగడ్డలు, చేపలు, పండ్లు విక్రయించేవాడు. బైక్ వాయిదాలు చెల్లించక పోవడంతో ఐదు రోజుల క్రితం ఫైనాన్స్ వ్యాపారులు ద్విచక్ర వాహనాన్ని బలవంతంగా లాక్కెళ్లారు. దీంతో మంజ తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి లుంగీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం మంజ మనుమరాలు ఇంటి తలుపులు తీసి చూసే సరికి దూలానికి వేలాడుతూ కన్పించాడు. మంజకు కూతురు, కుమారుడు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తేలని సాగర్ పంచాయితీ

● 35 రోజులుగా మూతపడిన కంట్రోల్ రూం ● లిఫ్ట్ రూం నుంచే నీటి వివరాలు నమోదు చేస్తున్న తెలంగాణ ఇంజనీర్లు




అసంపూర్తిగా సూట్ గేట్లపై రోడ్డు నిర్మాణ పనులు, అసంపూర్తి క్రేన్ ట్రాక్ పనులు

నాగార్జునసాగర్, జనవరి 3: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద 35 రోజుల కిందట ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న నీటి పంచాయితీ ప్రభావం నిర్వహణ పనులపై పడింది. ప్రధాన డ్యాంపై సీఆర్‌పీఎఫ్ భద్రత కొనసాగుతుండగా, 13వ నంబరు గేటు దాటి తెలంగాణ అధికారులను, సిబ్బందిని అటు వైపునకు వెళ్లనివ్వడం లేదు. దీంతో ప్రధాన డ్యాంపై పూర్తి చేయాల్సిన నిర్వహణ పనులు అసంపూర్తిగా నిలిచాయి.

పంచాయితీ మొదలైంది ఇలా..

గత ఏడాది నవంబరులో తెల్లవారితే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో 29వ తేదీన అర్ధరాత్రి ఏపీ పోలీసులు, నీటి పారుదల శాఖ అధికారులు ప్రధాన డ్యాంపైన ఉన్న ఎస్పీఎఫ్ సిబ్బందిపై దాడి చేసి, సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతో పాటు రక్షణ గేట్లను విరగ్గొట్టి ప్రధాన డ్యాంపైకి చేరుకున్నారు. అంతటితో ఆగకుండా ప్రాజెక్టుకు మొత్తం 26గేట్లు ఉండగా అందులో 13వ నంబరు గేటు నుంచి ఆంధ్రప్రదేశ్‌కి చెందుతాయని, అలాగే ఏపీ వైపున ఉన్న కుడి కాల్వ నిర్వహణ కూడా తమకే చెందుతుందని 13వ నెంబరు గేటు వద్ద కంచెను ఏర్పాటు చేసి, బారీకేడ్లను పెట్టి ఆ రాష్ట్ర పోలీసులు పహారా కాశారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికారులు కుడి కాల్వకు బలవంతంగా నీటిని విడుదల చేసుకున్నారు. దీంతో తెలంగాణ ప్రభుత్వ నీటి పారుదల శాఖ అధికారులు కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కి ఫిర్యాదు చేయగా కుడి కాల్వకు నీటి విడుదల నిలిపివేయాలని కేఆర్ఎంబీ ఆంధ్రప్రదేశ్ సీఎస్‌ను ఆదేశించింది. అయినప్పటికీ ఏపీ ప్రభుత్వం నీటి విడుదలను నిలిపివేయలేదు. తెలంగాణలో నవంబరు 30వ తేదీన ఎన్నికలు పూర్తవగానే ఎడమ వైపున డ్యాంపై పోలీసులు మోహరించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కేంద్ర జలశక్తి శాఖ రంగంలోకి దిగి ఇరురాష్ట్రాల సీఎస్‌లు, ఈఎన్‌సీ అధికారులు, డీజీపీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి పంచాయితీని తాత్కాలికంగా సద్దుమణిగేలా చేశారు. డ్యాంపై భద్రత కోసం సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించారు. దీంతో గత ఏడాది డిసెంబరు 3వ తేదీన కంచెను, బారీకేడ్లను తొలగించారు. నాటి నుంచి ప్రధాన డ్యాంపై ఇరువైపులా సీఆర్‌పీఎఫ్ బలగాలు పహారా కాస్తున్నాయి.

అసంపూర్తిగా రూ.5 కోట్ల పనులు

సాగర్ ప్రధాన డ్యాంపై సూట్ గేట్లు, కుడి కాల్వ గేట్లు, క్రేన్ ట్రాక్ మరమ్మతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లతో ప్రారంభించింది. పనులు జరుగుతుండగానే ఆంధ్రప్రదేశ్ పోలీసులు, నీటి పారుదల శాఖ అధికారులు ప్రధాన డ్యాంపై గొడవను సృష్టించడంతో గేట్లు బిగించడం పూర్తయినప్పటికీ, గేట్లపై తొలగించిన రోడ్డు నిర్మాణ పనులు, క్రేన్ ట్రాక్ పనులతో పాటు క్రస్ట్‌గేట్ల రోప్‌లకు గ్రీసింగ్, రబ్బరు సీల్ బిగింపు, జనరేటర్లకు మరమ్మతులు, కేబుల్ లైన్ల బిగింపు, వంటి పనులు నిలిచిపోయాయి. వానాకాలం సీజన్ ప్రారంభం కావడానికి ముందే ప్రతి ఏటా క్రస్ట్ గేట్ల సర్వీసింగ్ పనులను అధికారులు డిసెంబరు నెల నుంచే ప్రారంభిస్తుంటారు. ఈ ఏడాది ఇరు రాష్ట్రాల గొడవతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

రాష్ట్ర విభజన అనంతరం ప్రాజెక్టు నిర్వహణ ఇలా

2014లో రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉన్న ప్రాజెక్టుల నిర్వహణను విభజన కమిటీ నిర్ణయించింది. శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణను ఆంధ్రప్రదేశ్ చూసుకోవాలని, సాగర్ ప్రాజెక్టు నిర్వహణను తెలంగాణ ప్రభుత్వం చూసుకుంటుందని తెలిపింది. దీంతో తొమ్మిదేళ్లగా ప్రాజెక్టుల నిర్వహణ అలాగే కొనసాగుతున్నా, గత ఏడాది నవంబరు 29వ తేదీన ఏపీ ప్రభుత్వం వివాదం సృష్టించింది.

35 రోజులుగా మూతపడిన కంట్రోల్ రూం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య సాగర్ ప్రధాన డ్యాంపై వివాదంతో 35 రోజులుగా కంట్రోల్ రూం మూతపడింది. 13వ నంబరు గేటు దాటి తెలంగాణ అధికారులను ఏపీ సీఆర్‌పీఎఫ్ బలగాలు రానివ్వడం లేదు. దీంతో 26వ గేటుకు అవతల ఉన్న కంట్రోల్ రూం 35 రోజులుగా మూతపడింది. దీంతో నీటి నిల్వల లెక్కలు తెలంగాణ అధికారులు ఎడమ వైపున ఉన్న లిఫ్ట్ రూంలో కూర్చుని నమోదు చేస్తున్నారు. అవుట్ ఫ్లో, ఇన్ ఫ్లో వివరాలు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి నీటి విడుదల వివరాలను, కుడి, ఎడమ కాల్వల నీటి ఆవిరి, లీకేజీల నష్టాలను నమోదు చేయలేకపోతున్నామని తెలంగాణ నీటి పారుదల శాఖ అధికారులు వాపోతున్నారు.

ప్రధాన డ్యాంపై కొనసాగుతున్న సీఆర్‌పీఎఫ్ బలగాల భద్రత

సాగర్ ప్రధాన డ్యాంపై ఎడమ వైపున తెలంగాణ సీఆర్‌పీఎఫ్ బలగాలు, కుడి వైపున ఏపీ సీఆర్‌పీఎఫ్ బలగాల భద్రత కొనసాగుతోంది. కంట్రోల్ రూం వద్ద కూడా సీఆర్‌పీఎఫ్ బలగాలే పహారా కాస్తున్నాయి. ఎస్పీఎఫ్ బలగాలు కేవలం ఎడమ ఎర్త్ డ్యాం, గ్యాలరీలు, ఎడమ కాల్వ, ప్రధాన జలవిద్యుత్ కేంద్రాల వద్ద పహారా కాస్తున్నాయి.



కుడి కాల్వ గేట్లపై అసంపూర్తిగా రోడ్డు పనులు

సమయం కోరిన తెలంగాణ ప్రభుత్వం

తెలుగు రాష్ట్రాల మధ్య నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వహణ, నీటి విడుదలపై కేంద్ర జలశక్తి డిసెంబరు 6వ తేదీన చర్చలకు ఇరు రాష్ట్రాల అధికారులను ఆహ్వానించింది. అయితే అప్పటికీ తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు కాకపోవడంతో అధికారులు జనవరి మొదటి వారం వరకు గడువు కావాలని కోరారు. ఆ మేరకు సమయం కేంద్రం ఇచ్చింది. అయితే బుధవారం రాష్ట్ర నీటిపారుదల ప్రిన్సిపల్ సెక్రటరీగా రాహుల్ బొజ్జ నియామకం కావడంతో త్వరలో సమావేశమయ్యే అవకాశం ఉంది. అనంతరం సమస్యకు పరిష్కారం లభించనుంది.

సకాలంలోనే పనులు పూర్తిచేస్తాం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వహణపై ఈ నెలలోనే చర్చలు జరుగనున్నాయి. అసంపూర్తిగా వదిలేసిన పనులను చర్చల అనంతరం సకాలంలో పూర్తి చేస్తాం. వచ్చే వరదల నాటికి ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూస్తాం.

● నాగేశ్వరరావు, సాగర్ ప్రాజెక్టు ఎస్ఈ.

విద్యార్థినికి అసభ్య మెసేజ్‌లు

● ప్రైవేట్ ఉపాధ్యాయుడికి దేహశుద్ధి ● పోక్సో కేసు నమోదు

● యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో ఘటన



పాఠశాలలో విచారణ నిర్వహిస్తున్న పోలీసులు, ఉపాధ్యాయుడు సంజయ్



భువనగిరి టౌన్, జనవరి 3: విద్యాబుద్ధులు నేర్పుతూ పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థినికి అసభ్య మెసేజ్‌లు పంపుతూ ఇబ్బంది పెట్టాడు. దీంతో అతని చేష్టలను గమనించిన విద్యార్థిని కుటుంబ సభ్యులు పాఠశాల ఆవరణలోనే దేహశుద్ధి చేశారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. పోలీసులు, విద్యార్థిని కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... భువనగిరి పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో నివసించే బెల్లి సంజయ్ మూడేళ్లుగా సైన్స్ ఉపాధ్యాయుడిగా పట్టణంలోని మూడు ప్రైవేట్ పాఠశాలల్లో పీరియడ్ వారీగా సబ్జెక్ట్ బోధిస్తుంటాడు. అందులో భాగంగా భువనగిరిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండేళ్లుగా పనిచేస్తున్నాడు. పాఠ్యాంశాల్లో అనుమానాల నివృత్తికోసం విద్యార్థులు ఆ ఉపాధ్యాయుడిని పలుమార్లు ఫోన్లో సంప్రదించేవారు. ఇదే అదునుగా సంజయ్ ఓ పదో తరగతి విద్యార్థిని సెల్‌ఫోన్‌కు రెండు నెలలుగా అసభ్యకర మెసేజ్‌లు పెడుతున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా అసభ్యకర ఫొటోలు పంపుతున్నాడు. తన పోస్టులకు స్పందించకుంటే ఫెయిల్ చేయిస్తానని హెచ్చరించసాగాడు. దీంతో ఉపాధ్యాయుడి వేధింపులను తట్టుకోలేక ఆందోళనకు గురవుతున్న విద్యార్థినిని కుటుంబ సభ్యులు ఆరాతీయగా ఉపాధ్యాయుడి భాగోతం వెలుగుచూసింది. దీంతో ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లి ఆరాతీస్తున్న క్రమంలో సంజయ్ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. తనకు ఏమీ తెలియదని చెప్పడంతో ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు అతడికి దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎస్.సుధీర్ కృష్ణ, ఎస్ఐ నాగరాజు పాఠశాలకు వెళ్లి ఆ ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపెట్టగా రిమాండ్‌కు ఆదేశించింది. అయితే సంజయ్‌పై ఏడాది క్రితం మరో పాఠశాలలో ఇదే తరహా లైంగిక వేధింపుల ఫిర్యాదులు వచ్చినట్లు తెలుస్తోంది. సంజయ్‌కు ఆరు నెలల క్రితం వివాహం కాగా, భార్యతో సైతం గొడవ పడడంతో పుట్టింటికి వెళ్లినట్లు సమాచారం. కాగా నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఉదంతాలకు యాజమాన్యాలు కూడా బాధ్యత వహించాలంటూ ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్, ఆల్ ఇండియా పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జెండగే, డీఈవో నారాయణరెడ్డి, డీసీపీ రాజేష్‌చంద్రలకు ఫిర్యాదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

నేరేడుచర్ల, జనవరి 3: అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని పెంచికల్‌దిన్న పంచాయతీ పరిధిలోని తెలగరామయ్యగూడెంలో జరిగింది. ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సోమగాని లీలమ్మ(80) ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. ఆమె తలకు గాయమై అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉంది. లీలమ్మ కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వైన్స్‌షాపులో చోరీ

రాజాపేట, జనవరి 3: యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం పొట్టిమర్రి చౌరస్తాలోని వైన్స్‌లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పొట్టిమర్రి చౌరస్తా వద్ద ఉన్న వైన్స్‌ను రాత్రి 10గంటలకు మూసివేశారు. గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి వైన్స్ షెట్టర్‌ను పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. రూ.4.21లక్షల నగదుతో పాటు 10 మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లారు. యాదగిరిగుట్ట ఏసీపీ శివరాంరెడ్డి, సీఐ సురేందర్‌రెడ్డి, సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. క్లూస్‌టీం డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ వైన్స్ నిర్వాహకులు మాధవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

5 నిమిషాలు.. 13 కిలోమీటర్లు

● డ్రోన్‌తో మందుల సరఫరాకు ట్రయల్ రన్



భువనగిరిలో నిర్వహిస్తున్న డ్రోన్ ట్రయల్ రన్

భువనగిరి టౌన్, జనవరి 3: అత్యవసర సమయాల్లో వేగంగా మందులను సరఫరా చేసే లక్ష్యంతో ఓ ఔత్సాహిక బృందం బుధవారం భువనగిరిలో ట్రయల్ రన్ నిర్వహించింది. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ ఎయిమ్స్ నుంచి భువనగిరి మండలం బొల్లేపల్లి పీహెచ్‌సీకి, అక్కడి నుంచి భువనగిరికి తిరిగి భువనగిరి నుంచి ఆస్పత్రికి 25కిలోల బరువు గల మందులను డ్రోన్ ద్వారా సరఫరా చేశారు. ట్రయల్ రన్ విజయవంతం అయితే మందుల సరఫరాకు వైద్య ఆరోగ్య శాఖ, ఎయిమ్స్ ఆస్పత్రి ఒప్పందం కుదుర్చుకుంటామని బృందం తెలిపింది. ఎయిమ్స్ నుంచి భువనగిరికి అనగా 13 కి.మీ.లు డ్రోన్ ద్వారా 5 నిమిషాల వ్యవధిలో మందులను సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ట్రయల్ రన్‌ను పలువురు ఉత్సాహంగా వీక్షించారు.

ఆన్‌లైన్‌లో సైన్స్ పండుగ

● ఈ నెల 19 నుంచి 25 వరకు జిల్లాస్థాయి ఇన్‌స్పెయిర్- మానక్ ● సన్నద్ధమవుతున్న విద్యార్థులు

పెరుగుతున్న శాస్త్రవిజ్ఞానం మానవ రహిత సేవలను అందుబాటులోకి తెస్తోంది. ఇప్పటికే పలు రంగాల్లో మనుషులను పోలిన రోబోలు ప్రవేశించి వాటి పనులు అవే చేసుకుంటున్నాయి. యావత్ ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వైపునకు అడుగులు వేస్తుండగా విద్యార్థుల్లో టెక్నికల్ స్కిల్స్‌ను పెంచేందుకు విద్యాశాఖ చర్యలను ముమ్మరం చేస్తోంది. కొత్త ఆలోచనలతో సరికొత్త ఆవిష్కరణలు రూపొందించే దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తోంది.

(మిర్యాలగూడ టౌన్)



రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయి రాజ్య శాస్త్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శని-23 పోటీలు జనవరి రెండో వారంలో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. జవహర్ లాల్ నెహ్రూ జాతీయ వైజ్ఞానిక గణిత, పర్యావరణ ప్రదర్శన పేరుతో నిర్వహించనున్న ఈ సైన్స్‌ఫెయిర్‌లో సమాజం కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ పేరుతో విద్యార్థులు పలు ప్రాజెక్టులను రూపొందించి ఆన్‌లైన్లో ప్రదర్శించే ఏర్పాట్లు చేస్తోంది.

రెండో వారంలో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్

ఈ నెల 19 నుంచి 25 వరకు జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించనుంది విద్యాశాఖ. జిల్లాలోని సమస్త యాజమాన్యాల పరిధిలోని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు స్పష్టమైన ఆదేశాలిచ్చింది. పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి అభ్యసించే విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొంటారు. గణిత, సైన్స్ ఉపా ధ్యాయులు సమన్వయంతో పనిచేసి ప్రతి పాఠశాల నుంచి మూడు ప్రాజెక్టులు రూపొందించి ఆన్‌లైన్‌లో ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని కోరింది. ఆయా ప్రాజెక్టులను గూగుల్ ఫారమ్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 8వ తేదీలోగా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. జిల్లా స్థాయిలో ప్రదర్శించిన ప్రాజెక్టుల్లో ఉత్తమైనవి ఎంపిక చేసి రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు పంపిస్తారు. సైన్స్ ఫెయిర్ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరించనుండగా కన్వీనర్‌గా డీఈవో, సభ్యులుగా డైట్ ప్రిన్సిపాల్, జిల్లా సైన్స్ అధికారి కమిటీల్లో ఉండనున్నారు. 2022-23 విద్యాసంవత్సరంలో ఇన్‌స్పైర్ మానక్ అవార్డ్స్‌కు జిల్లా వ్యాప్తంగా 143మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు తాము రూపొందించిన ప్రాజె క్టులను ఇన్‌స్పైర్ మానక్ అవార్డ్స్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. జనవరి 1 నుంచి 18వ తేదీ వరకు డిస్ట్రిక్ట్ లెవల్ ఎగ్జిబిషన్ ప్రాజెక్టు కాంపి టీషన్ (డీఎల్ఈపీసీ)లో వీడియో, తదితర వివరాలను పొందపరచాలని డీఈవో కోరారు. ఇన్‌స్పైర్ మానక్ అవార్డ్స్‌కు ఎంపికైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ ప్రాజెక్టుల నిర్వహణ-మూల్యాంకనం చేయించేలా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, గైడ్ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.

ప్రదర్శనలో ప్రధానాంశాలివే..



మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రాజెక్టుల రూపకల్పనలోనూ మార్పులు, చేర్పులు ఉండాలి. సమాజం కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ' పేరుతో ఏర్పాటు చేయనున్న సైన్స్ ఫెయిర్‌లో పర్యావరణ జీవనశైలి(జీవితం), ఆరోగ్యం, వ్యవసాయం, సమాచారం, రవాణా, కంప్యూటేషన్ థింకింగ్ అనే ఉప అంశాలను చేర్చారు. ఈ విభాగాల్లో ప్రథమస్థానం సాధించిన ప్రదర్శనల్లో జూనియర్, సినియర్ విభాగాల నుంచి ఐదేసి ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి పంపిస్తారు. ఆయా అంశాల్లో వర్కింగ్ మోడల్స్‌కు ప్రాధాన్యం ఉంటుంది. సైన్స్ ఫెయిర్ జరిగే రోజుల్లో వివిధ అంశాల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, సెమినార్లు ఉంటాయని అధికారులు తెలిపారు.

విద్యార్థులకు దిశానిర్దేశం చేయాలి



జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నాం. జనవరి 19నుంచి 25 వరకు ఇన్‌స్పైర్-మానక్ ప్రదర్శన ఉంటుంది. ఇందులో గతేడాది ఎంపికైన విద్యార్థులు పాల్గొంటారు. ఇక ఈ నెల రెండోవారంలో నిర్వహించనున్న రాజ్య శాస్త్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శని-23లో జిల్లాలోని సమస్త యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి అభ్యసించే విద్యార్థులు పాల్గొంటారు. నిర్దేశించిన అంశాలపై ప్రాజెక్టులు రూపొందించి పాల్గొనే విధంగా ఆయా పాఠశాలల సైన్స్, మ్యాథ్స్ ఉపాధ్యాయులు కృషిచేయాలి. అర్థవంతమైన ప్రాజెక్టులను రూపొందించే విధంగా ఆయా సబ్జెక్టు టీచర్లు విద్యార్థులకు దిశానిర్దేశం చేయాలి.

● బొల్లారం బిక్షపతి, నల్లగొండ డీఈవో

సైన్స్ పట్ల ఆసక్తి పెంచేందుకే..



మానవ మనుగడకు సైన్స్ అవసరం ఎంతో ఉంది. అందుకే విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలను పెంచే దిశగా చర్యలు చేపట్టాం. సామాన్య, గణిత శాస్త్ర ఉపాధ్యాయులు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రతి పాఠశాల నుంచి ప్రాజెక్టులు రూపొందించే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలి. ఆన్‌లైన్లో నిర్వహించే జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌కు సంబంధించి విధివిధానాలు అన్ని పాఠశాలలకు పంపించాం. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఏమైనా సందేహాలు ఉంటే సెల్: 9848578845 నెంబరుకు కాల్ చేసి నివృత్తి చేసుకోవాలి. ప్రకృతి, పర్యావరణం, సమాచారం, వ్యవసాయం, సాంకేతికత, జీవనవిధానమనే అంశాలను వివరించాలి.

● వనం లక్ష్మీపతి, జిల్లా సైన్స్ అధికారి, నల్లగొండ.

శాస్త్రోక్తంగా నిత్యవిధి కైంకర్యాలు



లక్ష్మీనృసింహుల తిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జనవరి 3: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్యవిధి కైంకర్యాలు శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రభాతవేళ సుప్రభాతంతో కొండగుహలోని స్వయంభువులను మేల్కొలిపిన ఆచార్యులు బిందెతీర్థంతో నిత్యోత్సవాలను ఆరంభించారు. మూలమూర్తులను అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి, ప్రాకార మండపంలో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి సుదర్శన హోమం, నిత్యతిరుకల్యాణం నిర్వహించారు. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తుల చెంత సువర్ణపుష్పార్చన పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చన పూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. కొండపైన అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్య పూజలు, కొండకింద వ్రత మండపంలో సత్యనారాయణస్వామి వ్రతపూజలు కొనసాగాయి. ప్రభాతవేళ గోదాదేవిని ఆరాధిస్తూ తిరుప్పావై వ్రతపూజలు వైభవంగా కొనసాగాయి. తన మనోవల్లభుడు శ్రీరంగనాథుడిని భర్తగా పొందేందుకు ఆలపించిన తిరుప్పావై పాశుర పఠనం జరిపిన అర్చకబృందం ఆండాళ్ అమ్మవారిని కొలుస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.16,47,443 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిని సందర్శించిన భక్తులు హుండీల్లో సమర్పించిన మొక్కు కానుకలను గురువారం కొండకింద వ్రత మండపం రెండో హాల్‌లో లెక్కించనున్నట్లు దేవస్థాన ఈవో రామకృష్ణారావు ప్రకటనలో తెలిపారు.

మట్టపల్లిలో భక్తవత్సలుడికి గరుడోత్సవం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీ నృసింహుని క్షేత్రంలో శ్రీరాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుని నిత్యాకల్యాణం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీస్వామి, రాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత భక్తవత్సలునికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. తర్వాత ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు జరిగాయి. ఉదయం హోమాధికాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణ మూర్తులను పరిణయోత్సవ వేదికపైకి వేంచేయించి పుణ్యాహవాచనం గావించారు. పాదప్రక్షాళనం మధుపర్క పూజలు యాథావిధిగా చేపట్టారు మాంగళ్యధారణ, యజ్ఞోపవీత ధారణలు అనంతరందివ్యమూర్తులకు గరుడోత్సవం జరిగింది. ఆలయ తిరువీధుల్లో స్తంబోద్భవుడిని ఊరేగించారు. అనంతరం దేవేరులను ఆలయ ప్రవేశం చేయించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మట్టపల్లి వాసునికి హైదరాబాద్‌కు చెందిన చెన్నూరి సాహితీ-పవన్‌కుమార్‌లు రూ.20వేల విలువ చేసే వెండి హారతి ప్లేటును ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, అర్చకుల సమక్షంలో దేవస్థానానికి అందజేశారు.



మఠంపల్లిలో వెండి హారతి ప్లేటు బహూకరిస్తున్న దాత

సార్.. మా పొట్ట కొట్టొద్దు

ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఫలితంగా తమ జీవనోపాధి పోయిందని పలువురు ఆటో డ్రైవర్లు వాపోయారు. ఉమ్మడి నల్లగొండ వ్యాప్తంగా గురువారం ఆందోళనకు దిగారు. పలు చోట్ల భిక్షాటన చేసి ప్రభుత్వం తమ గోడు ఆలకించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి దూరం చేసి తమ కుటుంబాల పొట్ట కొట్టొద్దని కోరారు.

నల్లగొండ, జనవరి 3: టీఏటీయూ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లు బిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాజర్ అలీ మీర్జా, నల్లగొండ టీఏటీయూ అసెంబ్లీ కన్వీనర్ కలగొని యాదగిరిగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు ప్రదర్శన చేస్తూ పాదచారుల దగ్గర భిక్షమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు నెల రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం నాయకులు వెంకన్న, చోటు, రాము, నాయక్, వజ్రయ్య, మహేష్, రవిగౌడ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో రాస్తారోకో

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో ఆటో డ్రైవర్లు రాస్తారోకో చేశారు. అమ్మనబోలు రోడ్డు నుంచి బస్టాండ్ వరకు ఆటోలతో ర్యాలీగా చేరుకున్న ఆటో డ్రైవర్లు బస్టాండ్ ఎదుట బైఠాయించారు. ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణ సౌకర్యం కారణంగా ఆటోలలో ప్రయాణించే వారి సంఖ్య తగ్గి నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోలు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న తమకు ఈ పరిణామం వీధినపడేలా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులుగా ఈఎంఐలు కట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు బింగి జానయ్య, మునుకుంట్ల గణేశ్, ఉయ్యాల శ్రవణ్, యాదయ్య, కే. సత్తయ్య కే. పరమేశ్, కే. నర్సింహ్మారావు, డీ. లింగయ్య, బీ. రవి, ఎం. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో భిక్షాటన చేస్తున్న ఆటో డ్రైవర్లు



ఆలేరులో భిక్షాటన చేస్తున్న ఆటో డ్రైవర్లు

ఉపాధి కోల్పోతున్నాం

ఆలేరు రూరల్: యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో టీఏటీయూ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి సంతోష్‌గౌడ్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల కుటుంబాన్ని అధికారంలో ఉన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఉపాధి కోల్పోతున్నందున ఆటో డ్రైవర్లను ఆదుకునే విధంగా ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు చెక్క వెంకటేష్, తేరపు రాములు, ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు కోరికొప్పుల అంజయ్య, గౌస్, చంద్రయ్య, మురళి, మల్లయ్య, విజయ్, ఉపేందర్, నర్సింహులు, భిక్షపతి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి : వీరేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల, జనవరి 3: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారంటీ పథకాలు ప్రజలందరికీ అదించాలని అన్నారు. అనంతరం పలు శాఖలపై సమీక్ష నిర్వహించారు. మండంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు వెంటనే పూర్తి చేయాలని సభ్యులు కోరారు. ప్రభుత్వ భూములను కాపాడాలని, చెరువులకు ఎఫ్‌టీఎల్ పరిధి నిర్ధారించాలన్నారు. గ్రామాల్లోని శ్మశానవాటికలకు విద్యుత్ సరఫరాకు కరెంటు స్తంభాలు ఇవ్వాలని, లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. తొలిసారి సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ కొలను సునీత, జడ్పీటీసీ సుంకరి ధనమ్మ, వైస్ ఎంపీపీ మర్ల అలివేలు, ఎంపీడీవో లాజర్, తహసీల్దార్ దశరధనాయక్ పాల్గొన్నారు.

రైతులను అధికారులు గౌరవించాలి : బీఎల్ఆర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, మిర్యాలగూడరూరల్, జనవరి 3: దేశానికి అన్నం పెట్టే రైతన్నలే ప్రత్యక్ష దైవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. అవంతీపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టీఎన్జీవోస్ తెలంగాణ వ్యవసాయ మార్కెట్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ అవసరాల కోసం వచ్చే రైతులను అధికారులు గౌరవించాలని అన్నారు. పంటల నూర్పిడి సమయాల్లో ధాన్యంతో మార్కెట్‌కు వచ్చే రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మార్కెట్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాట్లాడుతూ మార్కెట్ శాఖలో 70శాతం ఖాళీలు ఉన్నాయని, వాటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. 2008లో కోటి ఆదాయంలో ప్రారంభమైన అవంతీపురం మార్కెట్ నేడు 30 కోట్ల వార్షికాదాయానికి చేరువ కావడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ముక్రం, జిల్లా అధ్యక్షుడు మధుబాబు, నాయకులు ఉమామహేశ్వర్, శ్రీధర్, సైదులు, రవి, సుజాత, ఉమ, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో మట్టి రోడ్డు ఏర్పాటు


పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ రేఖ

కొండమల్లేపల్లి, జనవరి 3: కొండమల్లేపల్లి ఎంపీపీ రేఖ శ్రీధర్‌రెడ్డి తన సొంత నిధులతో మండలంలోని కొర్రోని తండా నుంచి డీఎంకుంట వరకు మట్టి రోడ్డును ఏర్పాటు చేయించేందుకు బుధవారం శంకుస్థాపన చేశారు. రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడాన్ని ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు స్పందించిన ఎంపీపీ రేఖ శ్రీధర్‌రెడ్డి తన సొంత నిధులతో మూడు కిలోమీటర్ల మేర మట్టి రోడ్డును ఏర్పాటు చేయించేందుకు ముందుకొచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొర్రోనితండా సర్పంచ్ రామునాయక్, ఉపసర్పంచ్ లతాపాండునాయక్, మాజీ సర్పంచ్ లాల్‌సింగ్‌నాయక్, నాయకులు కొర్ర గణేష్, బీమా, కొమ్యనాయక్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు చేయూత

నల్లగొండ స్పోర్ట్స్, జనవరి 3: గ్రామీణ క్రీడాకారులకు మెరుగైన క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అన్ని విధాలుగా చేయూతనిస్తామని వైఆర్పీ ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ యామ దయాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలో క్రీడాకారుల కోసం ఛత్రపతి శివాజీ- వైఆర్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన క్రికెట్ క్లబ్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రికెట్ క్లబ్, ఫ్రీడమ్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో క్షేత్రస్థాయి విద్యార్థులను క్రీడాకారులుగా తయారు చేయనున్నట్లు పేర్కొన్నారు. శివాజీ స్పోర్ట్స్ క్లబ్ వ్యవస్థాపకుడు బొమ్మపాల గిరిబాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ కలిగిన యువతను తయారుచేయనున్నట్లు తెలిపారు. 11 సంవత్సరాల నుంచి 40 మంది జాతీయస్థాయి కబడ్డీ క్రీడాకారులను, 11మంది స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అకాడమీ క్రీడాకారులను తయారు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోచ్ మద్ది కరుణాకర్, రాచూరి గణేష్, రాయల భానుప్రసాద్ పాల్గొన్నారు.

షణ్ముఖ సేవలు మరువలేనివి

రామగిరి, జనవరి 3: బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీరామోజు షణ్ముఖ బీజేపీకి, విశ్వబ్రాహ్మణ సంఘానికి అందించిన సేవలు మరువలేనివని విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు దాసోజు శ్రీనివాస్, పెందోట సోములు అన్నారు. బుధవారం స్థానిక విశ్వబ్రాహ్మణ వసతి గృహంలో సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీరామోజు షణ్ముక, కూరెళ్ల చంద్రకళ సంతాపసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీరామోజు షణ్ముక సంఘ్ పరివార్ సిద్ధాంతాలకు ఆకర్షితులై బీజేపీలో సుదీర్ఘకాలంగా పనిచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దాసోజు యాదగిరి, శ్రీపాద కృష్ణమూర్తి, బహురోజు రాఘవాచారి, పర్వతం నరేంద్రబాబు, పగిడిమర్రి వెంకటాచారి, కూరేళ్ల వెంకటేశ్వర్లు, భీష్మాచారి, కంచనపల్లి ఉమ తదితరులు పాల్గొన్నారు.


డిండిలో నివాళులర్పిస్తున్న టీచర్లు


నల్లగొండ క్లాక్‌టవర్‌లో అమరవీరుల స్తూపం వద్ద సావిత్రీబాయి పూలే ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు


నల్లగొండ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఐద్వా ఆధ్వర్యంలో సావిత్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకురాళ్లు


రావులపెంట జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులు...

సావిత్రీబాయి పూలే జీవితం ఆదర్శనీయం

మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జీవితం ఆదర్శనీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. సావిత్రీబాయిపూలే జయంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో ఆమె విగ్రహాలు, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సావిత్రీబాయి పూలే గొప్ప సంఘసంస్కర్త అన్నారు. మహిళల కోసం పాఠశాలను నిర్మించి విద్యను నేర్పిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.


దేవరకొండలో నివాళులర్పిస్తున్న నాయకులు


నల్లగొండ : టీడీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు


వెలిమినేడులో సీపీఎం నాయకుల నివాళి


చిట్యాలలో సావిత్రికి నివాళులర్పిస్తున్న ఎస్ఐ


దామచర్లలో నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు


సావిత్రి వేషధారణలో...


మిర్యాలగూడలో బీసీ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయికి నివాళులర్పిస్తున్న నాయకులు


నార్కట్‌పల్లి : ఎల్లారెడ్డిగూడెం జడ్పీహెచ్ఎస్‌లో మహిళ ఉపాధ్యాయులను సన్మానించిన ఉపాధ్యాయులు


హాలియాలో ఫ్లెక్సీకి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు


కట్టంగూరులో నివాళులరిస్తున్న నాయకులు


మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లిలో నివాళులర్పిస్తున్న ఏఐఎఫ్‌డబ్ల్యూ నాయకులు

పారదర్శక పాలనే ప్రభుత్వ లక్ష్యం

ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్‌వర్క్: పారదర్శక పాలనే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వేరేశం, అధికారులు అన్నారు. జిల్లాలోని పలు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆరు గ్యారంటీ పథకాలను వంద రోజుల్లో అమలుచేసి తీరుతామని ఎమ్మెల్యేలు తెలిపారు. అధికారులు పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాలను తనిఖీ చేశారు. ప్రజలతో మాట్లాడి దరఖాస్తులు ఇవ్వడంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని తెలిపారు. కేంద్రంలోనే ఉచితంగా దరఖాస్తులు ఇస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను జీరాక్స్ సెంటర్ల నుంచి తీసుకొస్తే వాటిని పరిగణలోకి తీసుకోమని తెలిపారు. ఇబ్బందులు లేకుండా కార్యక్రమాన్ని నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.

● ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన వారందరికి అభయహస్తం అందుతుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బుధవారం కేతేపల్లి, కట్టంగూరు మండలాలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ ప్రభుత్వం పథకాలు అందజేస్తుందని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీలు పెరుమాళ్ల శేఖర్, ముత్తిలింగం, ఎంపీడీవోలు వై. హరికృష్ణ, పోరెండ్ల సునీత, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

● ప్రభుత్వం ప్రజల వద్దకే పారదర్శక పాలన అందించాలనే ఉద్దేశంతో ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. వేములపల్లి మండలం సల్కునూరు గ్రామంలో ఎంపీపీ సునీతతో కలిసి ప్రజా పాలనలో పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం పదేళ్లయినా ఏ ఒక్కరికి రేషన్‌కార్డు, ఇళ్ల మంజూరు చేయలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలందరికీ సేవ చేయాలనే ఉద్దేశ్యంతోనే ఆరు గ్యారంటీల కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గ్రామంలో నిర్మించిన చెక్‌డ్యాం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంకెపాక రాజు, ఎంపీడీవో జానయ్య, ఐబీ డీఈ జనార్దన్, నాయకులు తమ్మడబోయిన అర్జున్, సైలాబ్‌నాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


కేతేపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం


వేములపల్లి: ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

● నల్లగొండలో నిర్వహించిన కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దరఖాస్తు ఫారాలను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కొత్త రేషన్ కార్డుల గురించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఫార్మాట్ రాలేదని, వాట్సప్‌లలో వచ్చే ఫార్మాట్‌ను నమ్మవద్దని సూచించారు. బుధవారం 5,565 దరఖాస్తులు రాగా మొత్తంగా 26,854 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రాములు, రెవెన్యూ అధికారి ఖాజా ఆరిఫుద్దీన్, కౌన్సిలర్ మారగోని నవీన్ గౌడ్, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● ప్రజాపాలనతో ప్రజలకు మేలు జరుగుతుందని మండల ప్రత్యేకాధికారి, డీఈవో భిక్షపతి అన్నారు. మాడ్గులపల్లి మండలంలోని కల్వలపాలెం భీమనపల్లి, గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యకమంలో ఎంపీపీ శ్రీవిద్య, ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ జమీరొద్దిన్, ఆర్ఐలు అక్తర్‌అలీ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

● ప్రజలకు దగ్గరగా ప్రజాపాలన కొనసాగుతుందని జడ్పీ ఫ్లోర్‌లీడర్ పాశం రాంరెడ్డి అన్నారు. తిప్పర్తిలో ఎంపీపీ విజయలక్ష్మితో కలిసి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ కచ్చితంగా అమలుచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో అధికారులు ఎంపీడీవో పి.మహేందర్‌రెడ్డి, ఏవో సన్నిరాజు, ఏఈ రమ్య, సర్పంచ్ రొట్టెల రమేష్ పాల్గొన్నారు.

● ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ ఆర్డీవో చెన్నయ్య అన్నారు. నిడమనూరు మండలంలోని వేంపాడ్‌లో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎంపీడీవో ప్రమోద్‌కుమార్, సర్పంచ్ అర్వ స్వాతిఅశోక్, ఆర్ఐ సునీత, వంశీ తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ: దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు


నల్లగొండ మండలం జీ చెన్నారంలో దరఖాస్తుల స్వీకరణ


తిప్పర్తిలో తీసుకుంటున్న జడ్పీటీసీ రాంరెడ్డి, ఎంపీపీ


నిడమనూరు: ప్రజాపాలనలో పాల్గొన్న ఆర్డీవో చెన్నయ్య

దేవరకొండ సమగ్రాభివృద్ధికి కృషి : బాలునాయక్


కోదండపురం వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి, దేవరకొండ, జనవరి 3: దేవరకొండ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. మండలంలోని కోదండపురం గ్రామంలోని గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ధర్మం వైపు నిలిచి కాంగ్రెస్‌కు పట్టం కట్టిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీల్లో రెండు గ్యారంటీలను అమలు చేసినట్లు తెలిపారు. రానున్న 100 రోజుల్లో మిగతా వాటిని కూడా సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తారని ఆయన వెల్లడించారు. నియెజకవర్గంలోని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మండలానికి మొదటిసారి వచ్చిన ఎమ్మెల్యేకు మండల నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహ, జడ్పీ ఫ్లోర్‌లీడర్ అలుగుబెల్లి శోభారాణిఏవిరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్లు జాలే నర్సింహారెడ్డి, వేణుధర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్య, ఎంపీటీసీలు మధుసూదన్‌రెడ్డి, నారాయణ, వెంకటేశ్వరరెడ్డి, అంజిరెడ్డి, విజయలక్ష్మీమూనా, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

● క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని, పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను మెరుగుపుచుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని మైనంపల్లి గ్రామంలో కొర్ర రమేష్ నాయక్ స్మారకార్థం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, పోటీల్లో స్నేహపూర్వకంగా పాల్గొనాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జాన్‌యాదవ్, పీఏసీఎస్ ఛైర్మన్లు జాలె నర్సింహారెడ్డి, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ వెంకటయ్య, ఎంపీటీసీ కొర్ర గౌతమిరాంసింగ్, సర్పంచ్ దీప్లనాయక్, నాయకులు కొర్ర రాంసింగ్‌నాయక్, హరికృష్ణ, నిర్వాహకులు విజయ్, తిరుపతి, రాంజీ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

నార్కట్‌పల్లి: బ్రాహ్మణ వెల్లెంల ఉదయసముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టును వెంటనే పూర్తిచేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ కోరారు. పార్టీ ఆవిర్భావ వారోత్సవాల్లో భాగం గా బుధవారం మండలంలోని అమ్మనబోలులో పార్టీ జెండాను ఎగురవేసి మాట్లాడారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని, కనీసం ఈ ప్రభుత్వమైనా బడ్జెట్‌లో రూ.500 కోట్లు నిధులు కేటాయించి పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొసాని యాద య్య, దార లక్ష్మయ్య, బాసాని శంకర్, ఎనుముల రవీందర్‌రెడ్డి, బోడ మల్లేష్, ఉపేందర్, దశరథ, వెంకన్న, వెంకటయ్య, గోపాల్‌రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

● అయోధ్యలో ఈనెల 22వ తేదీన రామమందిరం ప్రారంభాన్ని పురస్కరించుకుని పంపిణీ చేస్తున్న రాములోరి అక్షింతలను బుధవారం నార్కట్‌పల్లిలోని సన్‌షైన్ కాలనీలో ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరసేవకులు పొల్వాయి భాస్కర్‌రావు, సరాబు శ్రీను, సిగ స్వామి, శాపల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీసీతారామాంజనేయ చంద్రమౌళీశ్వర అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బూడిద కవిత శ్రీనివాస్ దంపతుల సహకారంతో అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వామి చిట్టెడి ప్రభాకర్‌రెడ్డి, భూతరాజు సత్తయ్య, లక్ష్మయ్య, గోపి, గణేష్, జయశంకర్, శ్రీను పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): మండలానికి చెందిన ఎన్ఆర్ఐ దంపతులు నెమలి సుదికమాధవరెడ్డి ఐఎన్‌టీయూసీ హమాలీ సంఘం వారికి వంట సామగ్రిని అందజేశారు. బుధవారం రాజవరం ఎంపీటీసీ నెమలి శ్రీధర్‌రెడ్డి ద్వారా సామగ్రిని అందచేశారు. వర్కాల పుల్లారెడ్డి, వర్కాల జయసింహారెడ్డి జ్ఞాపకార్థంగా అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కలసాని చంద్రశేఖర్, సర్పంచ్ శాగం శ్రవణ్‌కుమార్‌రెడ్డి, చెరువు సంఘం ఛైర్మన్ పిట్టల కృష్ణ, నాయకులు, కార్మికులు పెద్దభాస్కర్‌రెడ్డి, మల్లయ్య, చిట్టి, భాస్కర్‌రెడ్డి, సాలయ్య పాల్గొన్నారు.

కట్టంగూరు: కట్టంగూరు ఎంపీటీసీ మాద యాదగిరి పుట్టినరోజు సందర్భంగా కట్టంగూరు గ్రామపంచాయతీ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు పలకలు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిట్టపల్లి శివశంకర్, గడుసు సుధీర్‌రెడ్డి, మేడి శంకర్‌లతో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ పట్టణానికి చెందిన కరాటే క్రీడాకారుడు ఐ.గణేష్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ శ్రీధర్ తెలిపారు. వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యనభ్యసిస్తున్న గణేష్ రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపి బంగారు పతకం సాధించడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆదర్శనీయమన్నారు. నేషనల్స్‌కు ఎంపికైన గణేష్‌ను డీఎస్పీ వెంకటగిరి తన కార్యాలయంలో అభినందించారు.

● మిర్యాలగూడ పట్టణంలోని శ్రీరామమందిరంలో బధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో వాడవాడలా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు తల్లం అశోక్ మాట్లాడుతూ అయోధ్యలో రామాలయం ప్రారంభ వేడుకలు దేశమంతా ఉత్సాహంగా నిర్వహించుకోవడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో గంధం శ్రీనివాస్, కుక్కడపు మల్లయ్య, గుంటూరు చంద్రశేఖర్, ఓరుగంటి వీటీ, తెడ్ల రాజేశ్వరి, గంధం లీలారాణి, రజనీ, పుష్ప, శ్రీదేవి, శోభ పాల్గొన్నారు.

నిడమనూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూతనివ్వడమే లక్ష్యంగా కస్తూరి ఫౌండేషన్ పని చేస్తుందని ఆ ఫౌండేషన్ సభ్యుడు మెండె వెంకట్ అన్నారు. మండలంలోని నిడమనూరు, ముప్పారం, రాజన్నగూడెం, తుమ్మడం, ముకుందాపురం, నారమ్మగూడెం, ఊట్కూరు హైస్కూళ్ల తోపాటు నిడమనూరు కేజీబీవీల్లోని 200మంది పదో తరగతి విద్యార్థులకు రానున్న వార్షిక పరీక్షల దృష్ట్యా స్టడీ మెటీరియల్ అందజేసి మాట్లాడారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. పేద విద్యార్థులకు తోడ్పాటును అందించేందుకు ప్రతిఒక్కరూ ముందుకురావాలని కోరారు. విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో లావూరి బాలు, ఎల్కపల్లి మహేష్, సభ్యులు కంచర్ల రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు వెంకన్న, శంకరయ్య, నాగజ్యోతి పాల్గొన్నారు.

హాలియా: నల్లగొండ రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి మాతృమూర్తి రాములమ్మ ఇటీవల మృతి చెందడంతో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి బుధవారం యాదగిరి నివాసంలో ఆయన్ను పరామర్శించారు. ఈ సందర్భంగా రాములమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, ఎంపీపీలు భగవాన్‌నాయక్, నరేందర్‌రెడ్డి, సుమతిపురుషోత్తం, చెన్ను సుందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు మహేందర్‌రెడ్డి, రామారావు, పెద్దిరాజు, మునిసిపల్ వైస్ ఛైర్మన్ నల్లగొండ సుధాకర్, కౌన్సిలర్లు, వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, సతీష్‌రెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ కట్టా శేఖర్‌రెడ్డి మాతృమూర్తి కట్టా జానమ్మ ఇటీవల మృతిచెందారు. మండలకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించిన దశదినకర్మకు మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో హాజరై జానమ్మ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శేఖర్‌రెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ సలహాదారు, సీనియర్ జర్నలిస్టు దేవులపల్లి అమర్, గోరటి వెంకన్న, అల్లం నారాయణ తదితరులు ఉన్నారు.

చిట్యాల: చిట్యాల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేముల వీరేశంను ఘనంగా సన్మానించారు. నకిరేకల్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మేడిశెట్టి ఉమాశంకర్, గజ్జల భాస్కర్, మిర్యాల జగన్నాథం, కలకుంట్ల రవి, వెంకటేశ్వర్లు, కోటిలింగం పాల్గొన్నారు.

తిప్పర్తి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జడ్పీటీసీ పాశం రాంరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు.